# మనస్సును స్వాధీనం చేసుకొన్నవాడే నిజమైన మానవుడు

*ప్రేమస్వరూపులైన స్త్రీ, పురుషులారా!*

ఈశ్వరమ్మ దేహమును వదలిపెట్టిన దినమును మీరు 'ఈశ్వరమ్మ డే'గా పాటిస్తున్నారు. దేహము అశాశ్వతమైనది.

**దేహము పాంచభౌతికము, దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్**
**మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ ఆ**
**దేహియే దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ**

కాని, మీరు పాంచభౌతికమైన దేహముపైన భ్రాంతి పెట్టుకుంటున్నారు. దేహము అనిత్యము, అసత్యము. ఏది పుట్టి పెరుగునో అదంతా అశాశ్వతమే! ఈ ప్రపంచంలో ఉన్న సమస్తముకూడను నశించునదే! ప్రపంచమునందు నిలుచునది ఒక్కటి మాత్రమే. అదే మనస్సు. చాలామంది మనస్సును 'మంకీ మైండు'గా మార్చుకుంటున్నారు. చాలా పొరపాటు. ఇది □□□□□□□□ (మానవజాతి) యొక్క మైండు. మనస్సు అనేది మనిషియొక్క స్వరూపమే! అట్టి మనస్సును స్వాధీనము చేసుకోవటానికి మనము తగిన ప్రయత్నం చేయాలి. మనస్సును కంట్రోలు చేసినవాడే మానవుడు అనిపించుకోగలడు. మనస్సును ఇష్టప్రకారం వదలినటువంటివాడు కేవలం వానరుడు. లోకములో ఎంతోమంది ఎన్నియో చదువులు చదువుతుంటారు, ఎన్నియో గొప్ప కార్యములు చేస్తుంటారు. కాని, వీరినందరినీ మానవులని చెప్పటానికి వీలుకాదు. మనస్సును

sri sathyasaivachanamrutam

స్వాధీనము చేసుకొన్నవాడే నిజమైన మానవుడు. మనస్సును చెడు విషయాలపైకి పోనివ్వ కూడదు. మనస్సులో అనేకవిధములైన తలంపులు మంచివి, చెడ్డవి కలుగుతుంటాయి. మనము చెడును దూరంచేసి మంచిని స్వీకరించాలి. మనస్సును మనము లక్ష్మివలె భావించాలి. లక్ష్మి నిరంతరము 'నారాయణ, నారాయణ' అని స్మరిస్తుంటుంది. అట్టి నారాయణునిలో పుట్టినటువంటి తత్త్వం ఆత్మతత్త్వం. ఆత్మ అన్నా, మనస్సన్నా, హృదయమన్నా ఒక్కటే. ఆత్మ అనగా నారాయణుడే! మనస్సనగా అదీ నారాయణుడే! హృదయము అన్నా అదికూడా నారాయణుడే! నారాయణుని 'హృదయవాసి' అంటారు. మనస్సును మనం చాలా అలక్ష్యంగా చూస్తున్నాము. చాలా పొరపాటు. దానిని చాలా ఘనంగా తీసుకోవాలి. **(భగవాన్ ఒక సువర్ణ హారమును సృష్టించి దాని నడుమనున్న పతకమును చూపిస్తూ)** ఈ పతకము మధ్యభాగంలో లక్ష్మి ఉంది; చుట్టూ ఉన్న మణుల వంటివే కోరికలు. ఈ కోరికలకు అధిపతియే శాశ్వతమైన, సత్యమైన, నిత్యమైన లక్ష్మి. "మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" బంధనకు గాని, మోక్షమునకుగాని మనస్సే మూలకారణం. ఈ సత్యమును గుర్తించుకోవటానికి మీలో ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి.

నేను ఈస్టు ఆఫ్రికాకు వెళ్ళేముందు ఈశ్వరమ్మ వచ్చి, "స్వామీ! అక్కడెన్నో మృగాలుంటాయట; ఎన్నో భయంకరమైన దృశ్యాలు ఉంటాయట. కాబట్టి, మీరక్కడికి పోవద్దు. మీరు తలుచుకుంటే అన్నీ ఇక్కడికే వస్తాయి. వాటిని చూడటానికి మీరు పోనక్కర్లేదే! ఇంక, మీరెందుకు వెళుతున్నారు?" అని అడిగింది. "నేను వన్యప్రాణులను చూడటానికి వెళ్ళటం లేదు, భక్తుల ప్రేమపూర్వకమైన ప్రార్థనను మన్నించి వెళుతున్నాను" అని చెప్పాను. అక్కడికి వెళ్లినప్పుడు అక్కడున్న భక్తులందరూ చేరి కొన్ని ప్లేన్లను ఏర్పాటు చేశారు. ఆ ప్లేనులో అడవి అంతా చుట్టుకొని వచ్చాను. కంపాలా అడవిలో వేలాది ఏనుగులు కనిపించాయి. ఆ అడవి అంతా ఏనుగులమయంగా కనిపించింది. నేను అరటి పళ్ళు తీసికొని వెళ్ళి వాటికి ఇచ్చాను. అవి ఆనందంగా తిన్నాయి. అక్కడ 'బైసన్స్' (అడవిదున్నలు) కూడా వేల కొలది కనిపించాయి. ఇంక సింహాలు రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ పండుకొని ఉన్నాయి. వాటి తోకలమీదనుంచే నా జీపు వెళ్ళింది. కాని, అవి ఏమీ చేయలేదు.

sri sathyasai vahini vachanamrutam

ఎటువంటి క్రూరమృగములుకూడను మన మనస్సు మంచిగా ఉంటే మనలను ఏమీ చేయవు. మనము వాటినేమైనా చేసినప్పుడే అవి మనపైకి వస్తాయిగాని, మనము వాటిని ఏమాత్రము ముట్టకుండా ప్రేమతో చూసి నప్పుడు అవికూడా మనలను ప్రేమతో చూస్తాయి. 'యద్భావం తద్భవతి'. మన భావాలనుబట్టే అవి మనపట్ల విరోధముగాని, లేక విశ్వాసముగాని ప్రకటిస్తాయి. మేము అన్నింటినీ చూసుకుంటూ వెళుతుంటే ఒకచోట పదహైదు సింహాలు పండుకొని ఉన్నాయి. కొన్ని తమ పిల్లలకు పాలిస్తున్నాయి; కొన్ని ఏదో జంతువును చంపి తెచ్చి తింటున్నాయి. నా వెంట వచ్చినవాళ్ళతో చెప్పాను, "మనము ఏమీ చేయకపోతే అవికూడా మనలను ఏమీ చేయవు." ఒకరి దగ్గర కెమెరా తీసికొని నేను వాటి దగ్గరకు పోయి ఫోటోలు తీశాను. అవన్నీ నన్ను చూస్తూ చాలా ఆనందించాయి. చక్కగా ఆనందంగా పండుకున్నాయి. చూశారా! అవి మమ్మల్ని ఏమీ చేయలేదు. మీరు వాటిని చంపాలని, కొట్టాలని దురుద్దేశ్యంతో పోయినప్పుడు అవికూడా మిమ్మల్ని చంపటానికి వస్తుంటాయి. కనుక, అట్టి చెడ్డ భావముతో మనము పోకూడదు. ఏ ఒక్క ప్రాణిని కూడను మనము చెడ్డభావముతో చూడకూడదు.

ఈస్టు ఆఫ్రికానుండి నేను తిరిగి వచ్చేంతవరకు ఈశ్వరమ్మ నిత్యము యోచన చేసుకుంటూ, యోచన చేసుకుంటూ సరిగా భోజనముకూడా చేయకుండా చాలా బలహీనమైపోయింది. నేను కంపాలానుంచి దినమూ పొద్దున్న, సాయంత్రం ఫోను చేయించాను, "నేను బాగున్నాను, బాగున్నాను" అని. అది విని ఆమె కొంత సంతోషిస్తూ వచ్చింది. నేను కంపాలానుంచి వస్తూనే ఆమె చాలా ఆనందంతో కారుదగ్గరకు వచ్చి పూలహారం వేసింది. "స్వామీ! చాలా ఆనందంగా, ఆరోగ్యంగా తిరిగి వచ్చారు" అని చెప్పి లోపలికి తీసుకువెళ్ళి కొబ్బరికాయ తిప్పి దిష్టి తీసింది. "స్వామీ, మీ పర్యటన ఇంత గొప్పగా జరుగుతుందని నేను ఊహించలేదు" అన్నది. పుట్టపర్తికి వచ్చిన తరువాత గ్రామప్రజలందరితో తన ఆనందాన్ని పంచుకొంది. స్వామి ఎక్కడికి పోయినా తానుకూడా వెంట ఉండాలని ఆశించేది. ఆమె చూసినవన్నీకూడా పుట్టపర్తికి వచ్చి అందరికీ చెప్పేది. వారికి ఆదర్శాన్ని అందించేది. స్వామి పుట్టపర్తిని వదలిపెట్టకూడదని ఆమె కోరింది. "స్వామీ, చెట్టు ఎక్కడ పుట్టిందో అక్కడే పెరగాలిగాని, దానిని పెరికేసి వేరువేరు చోట్ల



sri sathyasai vahini

నాటుతూపోతుంటే అది చెడిపోతుంది. కనుక, మీరు పుట్టినచోటనే ఉండాలి", అని కోరింది. నేను అలాగేనని మాటిచ్చాను.

బెంగళూరులో సమ్మర్ క్లాసులు జరుగుతున్న రోజులవి. అప్పుడు ఈశ్వరమ్మకూడను నావెంట వచ్చింది. ఒకరోజు ఉదయం ఆమె టిఫిన్ చేసింది; కాఫీ త్రాగింది; ఉన్నట్లుండి 'స్వామీ, స్వామీ, స్వామీ' అని పిలిచింది. పైనుంచి 'ఏమి?' అన్నాను. 'రండి, రండి, రండి' అన్నది. నేను తక్షణమే దిగి వచ్చినాను. ఆమె నా చేయి తీసుకొని తన తలపై పెట్టుకొని ప్రాణం వదిలింది. అప్పుడు నేను ఆమె దేహాన్ని కారులో పుట్టపర్తికి పంపించాను. రామబ్రహ్మంను వెంట పంపించాను. చేయవలసినటువంటి కార్యములన్నీ చేయమని చెప్పాను. అక్కడ ఉన్నవారందరూ "స్వామీ! ఆ దేహము వెంట మీరుకూడా పోవాలి" అని చెప్పారు. 'నేను పోను' అన్నాను. సమ్మర్ క్లాసులు జరుగుతున్నాయి. అన్ని దేశాలనుండి స్టూడెంట్స్ వచ్చారు. ఆమె పోయిందని తెలిసి పిల్లలందరూ స్వామికూడా పుట్టపర్తికి వెళ్ళారని, ఆనాడు క్లాసులు ఉండవని అనుకున్నారు. కాని, యథాప్రకారం క్లాసులు జరిగాయి. రెండవ క్లాసుకు నేను వెళ్ళాను. 'స్వామి ఎట్లా వచ్చారు? ఈశ్వరమ్మ దేహమువెంట పోవాలి కదా!' అనుకున్నారు. ఆమె దేహమువెంట నేనెందుకు పోవాలి! వచ్చిన దేహము వచ్చినట్లుగానే పోతుంది. దేహమువెంట నేను రాలేదు. నేను ప్రత్యేకంగా వచ్చాను. కనుక, నేను వెంట పోకుండా ఆమె దేహాన్ని మాత్రమే పంపించి పుట్టపర్తిలో సమాధి చేయించాను. పుట్టపర్తిలోకూడా చాలామంది "ఏమి, దేహమువెంట స్వామి రాలేదే" అనుకున్నారు. అవును. దేహము ఏకంగా వచ్చింది, ఏకంగానే పోయింది. ఎవరికి వారు ఏకంగానే పుడుతున్నారు, ఏకంగానే పోతున్నారు. సమ్మర్ క్లాసులు పూర్తి చేసుకొని ఒక నెల తరువాత నేను పుట్టపర్తికి వెళ్ళాను. పుట్టపర్తిలో అందరికీ చెప్పాను, "పుట్టటం, పెరగటం, పోవటం దేహానికి సహజం. 'దేహము పాంచభౌతికము, దేహము కూలక తప్పదెప్పుడున్..' అందరి దేహములూ ఇట్టివే! కనుక, ఎవ్వరుకూడను దేహభ్రాంతి పెట్టుకోకూడదు."

పుట్టపర్తిలో ఉన్నప్పుడు నేను రాగిసంకటి మాత్రమే తీసుకుంటాను. రాగిసంకటి, గ్రౌండ్‌నట్ చట్నీ లేకపోతే తోటకూర పప్పు తీసుకుంటాను. అంతేగాని కూర్మాలు, 'బర్మాలు' నేను ముట్టను. ఈవిధంగా అలవాటు చేసుకున్నందుకు ఈశ్వరమ్మకూడా ఎంతో

sri sathyasaivachanamrutam

ఆనందించి "స్వామీ, ఈ అభ్యాసములను మీరు ప్రపంచానికి చాటాలి" అన్నది. "తప్పక నేను చాటుతాను" అన్నాను. ఈ కూర్మాలు, బర్మాల వాసనకూడా నేను ఇష్టపడను. కాని, వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఈ సంకటిగురించి వాళ్లకు తెలియదు కాబట్టి వాళ్లు చేసిందే తినటము జరిగింది. ఆయా సమయ సందర్భానుసారముగా నేను నడుచుకుంటూ వచ్చాను. నేను సరియైన పద్ధతిలో, నా పద్ధతులు మానకుండా, పరుల పద్ధతులు పట్టకుండా ప్రవర్తిస్తూ వచ్చాను. ఈ దేహము 82వ సం॥లో ప్రవేశిస్తున్నది. ఐతే ఈ దేహానికి 82 సంవత్సరాలని ఎవ్వరూ చెప్పటానికి వీలుకాదు.

మీరందరుకూడను సేవనుగురించి నేను చెప్పిన విషయాలను మరువకుండా మనస్సు నందుంచుకొని తదనుగుణంగా ప్రవర్తించాలని, స్వామి సేవలో మీ జీవితాన్ని సార్థకం గావించుకోవాలని ఆశిస్తూ నా ఉపన్యాసాన్ని విరమిస్తున్నాను.

**(మాతృశ్రీ ఈశ్వరమ్మ సంస్మరణ దినోత్సవం, తేదీ 06.05.2007, 'సాయిశ్రుతి' మందిరం (కొడైకెనాల్)**

sri sathyasai vachanamrutam